క్లుప్తంగా

పెద్దమ్మ బోనాల పండుగ



మదనాపురం: మండలంలోని దుప్పల్లిలో మంగళవారం పెద్దమ్మ బోనాల పండుగను గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు, యువతులు కొత్త కుండలతో అమ్మవారి బోనం తయారు చేసుకొని ఆలయానికి చేరుకున్నారు. ఆయా వీధుల నుంచి భాజాబజంత్రీలతో ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రధాన ఆలయం చుట్టూ ప్రదక్షణ చేసిన తర్వాత నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కార్యకర్తలకు ధన్యవాదాలు..

గోపాల్‌పేట: కాంగ్రెస్‌పార్టీ ఎంపీ అభ్యర్థి మల్లు రవి గెలుపునకు కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు పేరుపేరున ధన్యవాదాలు తెలుపుతున్నామని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలో పార్టీ మండల నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలను గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. అంతకు ముందు మండల కేంద్రంలో టపాసులు కాల్చి బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ సత్యశీలారెడ్డి, రేవల్లి మండల అధ్యక్షుడు పర్వతాలు, పట్టణ అధ్యక్షుడు శివన్న, ఆర్టీఐ చైర్మన్ కొంకి వెంకటేష్, బాల పీరు, చంద్రశేఖర్, మేస్త్రీ బాలయ్య, జగన్, బాలయ్య, వెంకటయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతుల ప్రదానం



పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్‌లో మదనగోపాలస్వామి ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఫైనల్‌లో పెంట్లవెల్లి, జటప్రోల్ జట్లు తలపడగా పెంట్లవెల్లి గెలుపొందింది. అనంతరం వైస్ ఎంపీపీ భీంరెడ్డి ట్రోఫీని అందజేశారు. క్రీడాకారులకు ఉజ్వల్ భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. గెలుపోటములు సమానంగా స్వీకరించాలని క్రీడాకారులకు సూచించారు. నాగిరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేర్పించండి

అయిజ: విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం కోరారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాలతోపాటు మండలంలోని మేడికొండ, పులికల్, రాజాపురం, బైనిపల్లి గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ కళాశాల గురించి ప్రచారం చేశారు. ఇంటర్ చదివే విద్యార్థులను మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని కోరారు. 2024లో నిర్వహించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన విద్యార్థులు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో మెరుగైన ఫలితాలు సాధించారని తెలిపారు. అనుభవం కలిగిన అధ్యాపకులతో విద్యాబోధన ఉంటుందని, కళాశాలలో అన్ని మౌలిక వసతులున్నాయని, ల్యాబ్ సౌకర్యాలు, ఉచిత పాఠ్య పుస్తకాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రాజేందర్, బాలస్వామి, శ్రీరాములు, చలపతిరెడ్డి, జహంగీర్ పాల్గొన్నారు.

తపాలా శాఖలో గ్రేడ్-1 పోస్టుమాస్టర్ల బదిలీలు

ఖమ్మంగాంధీ చౌక్: రాష్ట్రంలోని ఐదు హెడ్ పోస్టాఫీసుల్లో పనిచేసే హయ్యర్ సెలక్షన్ గ్రేడ్-1(హెచ్ఎస్‌జీ-1) పోస్టుమాస్టర్లను బదిలీ చేస్తూ హైదరాబాద్ ప్రాంతీయ పోస్టు మాస్టర్ జనరల్ సుమిత అయోధ్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఖమ్మం హెడ్ పోస్టాఫీస్ హెచ్ఎస్‌జీ గ్రేడ్-1 పోస్టుమాస్టర్ కె.కిరణ్‌కుమార్‌రెడ్డిని వరంగల్ హెడ్ పోస్టాఫీసుకు బదిలీ చేశారు. అలాగే, హన్మకొండ హెడ్ పోస్టాఫీస్ పోస్టు మాస్టర్ కె.సుబ్రమణ్యంను ఖమ్మంకు, హన్మకొండ హెడ్ పోస్టాఫీస్‌లో డీపీఎం(ఎస్‌బీ) పోస్టుమాస్టర్ ఎం.సురేష్‌బాబును మహబూబ్‌నగర్ హెడ్ పోస్టాఫీస్ పోస్టుమాస్టర్‌గా, కరీంనగర్ హెడ్ పోస్టాఫీస్ డీపీఎం(ఎస్‌బీ) పోస్టుమాస్టర్ కేవీ.పవన్‌కుమార్‌ను హన్మకొండ హెడ్ పోస్టాఫీస్ పోస్టుమాస్టర్‌గా, వరంగల్ హెడ్ పోస్టాఫీస్ డీపీఎం (మెయిల్స్) పోస్టుమాస్టర్ ఏ.తిరుపతిని కరీంనగర్ హెడ్ పోస్టాఫీస్ పోస్టుమాస్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇదిలా ఉండగా మరో ఇద్దరు పోస్టుమాస్టర్లకు హయ్యర్ సెలక్షన్ గ్రేడ్-1 పోస్టుమాస్టర్లుగా(హెచ్ఎస్‌జీ-1) పదోన్నతి కల్పించడమే కాక బదిలీ చేశారు. నిజామాబాద్ హెడ్ పోస్టాఫీస్‌లో పోస్టుమాస్టర్లు(హెచ్ఎస్‌జీ-2)గా పనిచేస్తున్న జి.గంగాధర్‌కు హెచ్ఎస్‌జీ-1గా ఉద్యోగోన్నతి కల్పించి ఆదిలాబాద్ హెడ్ పోస్టాఫీస్‌కు, కె.అజయ్‌కుమార్‌ను నిజామాబాద్ హెడ్ పోస్టాఫీస్‌లోనే హెచ్ఎస్‌జీ-1గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మల్లు రవి గెలుపుపై హర్షం

కొత్తకోట రూరల్: నాగర్‌కర్నూల్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి డా.మల్లు రవి విజయం సాధించడంపై ఐఎన్‌టీయూసీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గిరిజాదేవి హర్షం వ్యక్తం చేశారు. పెద్దమందడి మండలంలోని బలిజపల్లి, జంగమాయపల్లిలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆమె బాణసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మల్లు రవి గెలుపు కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు. ఇదే స్ఫూర్తి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఉమ, సుభాష్‌గౌడ్, జంట గ్రామాల కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బాలరాజ్ యాదవ్, నీలేందర్, మహమూద్, రాఘవేందర్‌రెడ్డి, మల్లేష్ యాదయ్య పాల్గొన్నారు.

పాన్‌గల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డా.మల్లు రవి 94,414 ఓట్లతో విజయం సాధించడంతో ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్యయాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని శాగాపూర్‌లో టపాసులు కాల్చి, మిఠాయిలు పంచి సంబరాలు నిర్వహించారు. డా.మల్లు రవికి కొల్లాపూర్ నియోజకవర్గంలో మంత్రి జూపల్లి ఆధ్వర్యంలో భారీ మెజార్టీ వచ్చిందన్నారు. పాన్‌గల్, అన్నారం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గేరి లక్ష్మయ్య, శ్రీనివాసులు, నాగేంద్రం, నర్సింహ, సుధాకర్, బాలస్వామి, బిచ్చన్న, సుదర్శన్, సూరయ్య పాల్గొన్నారు.



బలిజపల్లిలో సంబురాలు చేసుకుంటున్న గిరిజాదేవి, నాయకులు

ఖిల్లాఘనపురం: నాగర్‌కర్నూల్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి ఎంపీగా గెలుపొందడంతో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ అధ్యక్షతన బస్టాండులో సంబరాలు నిర్వహించారు. స్వీట్లు పంచి బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ వెంకటయ్య, జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవిని భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన గెలుపు కోసం కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఎదురు లేదని గుర్తు చేశారు. కార్యక్రమంలో బాలయ్య, అజీమ్, సతీష్‌కుమార్, దేవన్న, డాక్టర్ నరేందర్‌గౌడ్, ప్రకాష్, క్యామ రాజు, జన్ను మధు, లక్ష్మారెడ్డి, లింగస్వామి, వాస నాగేశ్వర్, ప్రభాకర్‌రెడ్డి, గోవిందు నాయక్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురంలో..



శాగాపూర్‌లో..

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

అమరచింత: ఉపాధి హామీ సమస్యలను పరిష్కరించాలంటూ ఈనెల 6న కలెక్టరేట్ ఎదుట ధర్నాను నిర్వహిస్తున్నామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ తెలిపారు. మండలంలోని పాంరెడ్డిపల్లిలో మంగళవారం ఉపాధి కూలీ పనులు చేస్తున్న వారిని కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో అలవెన్స్‌లు, పనిముట్లకు రోజువారీగా రూ.20 చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. కుటుంబంలో ఏడాదికి 200 వందల రోజుల పనిదినాలు కల్పించాలని, పథకంలో కొలతలను రద్దు చేయాలన్నారు. రోజు కూలీ కనీస వేతన చట్టం ప్రకారం రూ.600 చెల్లించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల బకాయిలను విడుదల చేయాలని కోరారు. పనిప్రదేశంలో రోజుకు రెండుసార్లు ఫొటో క్యాప్చర్ అన్న నిబంధన తొలగించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌ల వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమానికి ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శంకర్, మోహన్, నందిమల్ల రాజు, దేవర్ల మాసన్న, హైమావతి, నాగరాజు, మల్లేష్ తదితరులు ఉన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

'ఆశా కార్యకర్తలకు పదోన్నతులు కల్పించాలి'



డాక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆశాలు

మదనాపురం: ఆశాకార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వం ఏఎన్ఎం, జీఎన్ఎంగా పదోన్నతులు కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ డిమాండ్ చేశారు. ఆశాలకు పరీక్ష పెట్టడం సరైంది కాదని, నిర్ణయం ఉపసంహరించుకోవాలని కోరుతూ డాక్టర్ భవానీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశాలకు పరీక్ష పెట్టడం, ప్రభుత్వం ఇచ్చే సర్టిఫికెట్ వల్ల ఆశాలకు కలిగే లాభాలు గురించి సర్క్యులర్‌లో పొందుపరచలేదని ఆయన చెప్పారు. పారితోషకం లేని పనులు ఆశాలతో చేయించరాదని, జాబ్ చార్ట్ ఇచ్చి పనిభారాన్ని తగ్గించాలని కోరారు. ప్రసూతి సెలవులు కల్పించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న మూడేళ్ల యూనిఫామ్‌ను వెంటనే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు అనసూయ, కార్యదర్శి జిలేఖాబేగం, కోశాధికారి జ్యోతి, ఉపాధ్యక్షురాలు లక్ష్మి, సహాయకార్యదర్శి రేష్మ బేగం, సుజాత, చిన్నమ్మ, గంగ, మౌలానాబీ, భాగ్యలక్ష్మి, యశోద, స్వప్న, సుహాసిని, సలీమా, గౌరి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబురాలు



అమరచింతలో బీజేపీ నాయకుల విజయోత్సవ ర్యాలీ

ఆత్మకూర్: ప్రధానమంత్రి మోదీతోనే దేశ రక్షణ, దేశాభివృద్ధి సాధ్యమని పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి డీకే అరుణను ఓటర్లు గెలిపించారని నాయకులు అన్నారు. మంగళవారం ఆత్మకూర్‌తో పాటు మండలంలోని గ్రామాల్లో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ గెలుపుపై సంబురాలు చేసుకున్నారు. బాణసంచాలు కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. డీజే ఏర్పాటు చేసి నృత్యాలు చేశారు. ఈకార్యక్రమంలో పురఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్, కౌన్సిలర్ మహేశ్వరి, నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్, జిల్లా నాయకుడు అనిల్‌గౌడ్, మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి నాయకులు ఆనంద్, బాలకృష్ణ, శివశంకర్, తమ్మలివిజయ్, సద్దల వెంకట్, శ్యాం, సూరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాడవాడలా..

అమరచింత: మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా డీకే అరుణ గెలుపొందడంతో మంగళవారం పట్టణంలోని ఆయా వార్డుల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబురాలను నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఏడీఏ కూటమి అభ్యర్థులు విజయఢంకా మోగిస్తున్నారని, మూడోసారి ప్రధానిగా నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు అన్నారు. పట్టణంలోని బీజేపీ జెండా కట్ట వద్ద బాణాసంచా కాల్చుతూ మేళతాళాల మధ్య పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి మిఠాయిలను పంచిపెట్టారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు భాస్కర్, జిల్లా నాయకులు మరారి అశోక్, నరాల నారాయణ, వెంకటేశ్వర్లు, దుబాయ్ వెంకటేశ్వర్‌రెడ్డి, విజయ్ యాదవ్, మేర్వ అనిల్, మంగ అనిల్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో..

టీ స్టాల్‌లో చెలరేగిన మంటలు

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఓ యువకుడు నూతనంగా ఏర్పాటు చేసిన 'చాయ్ తలాబ్' టీ హోటల్లో మంగళవారం తెల్లవారుజామున ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. హోటల్ నిర్వాహకుడు బాలు తెలిపిన వివరాల ప్రకారం రోజు వారిలో భాగంగా సోమవారం రాత్రి హోటల్‌ను మూసివేసి ఇంటికి వెళ్లిపోయాడు. మంగళవారం తెల్లవారుజామున తాయ్ తలాబ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు గమనించి హోటల్ నిర్వాహకుడిని ఫోన్ చేయడంతో వెంటనే హోటల్ దగ్గరకు చేరుకుని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చాడు. ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. చాయ్ తలాబ్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి, తనకు రూ.లక్షల్లో ఆస్తి నష్టం జరిగిందని వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశాడు.



చాయ్ తలాబ్‌లో చెలరేగిన మంటలు

రామన్‌పాడుకు 41క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం తగ్గుతుంది. మంగళవారం 1,012 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. సమాంతర కాల్వ ద్వారా 41 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలియజేశారు.

మునిరంగస్వామి నాటక ప్రదర్శన

జడ్చర్ల టౌన్: మండలంలోని ఆలూరులో గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో శ్రీ రామాంజనేయ భజనమండలి ఆధ్వర్యంలో మునిరంగస్వామి నాటక ప్రదర్శన కొనసాగుతోంది. మూడురోజుల పాటు కొనసాగే నాటక ప్రదర్శన సోమవారం రాత్రి, మంగళవారం రాత్రి పూర్తయ్యింది. బుధవారం చివరిరోజుతో ముగియనుంది. తొలిరోజు మునిరంగస్వామి పాత్రను తిరుపతి, మంగళవారం కృష్ణ, బుధవారం పంతులు శ్రీనివాస్‌లు పోషిస్తున్నారు. నాటకంలో వెంకటయ్య తిరుమలస్వామిగా, మల్లారెడ్డి కృష్ణుడిగా, రాంగౌడ్ సమాధిరంగస్వామిగా, మల్లేష్ శంకరుడిగా, తిరుపతయ్య విష్ణుమూర్తిగా, భూదేవిగా రమేష్, పార్వతిదేవిగా రాజు, వెంకటలక్ష్మి కుమ్మరి ఆంజనేయులు, ఈశ్వర్ అచ్చమ్మగా పాత్రలు పోషిస్తున్నారు. ఏటా పర్వదినాలతోపాటు సెలవుదినాల్లోనూ గ్రామంలో నాటక ప్రదర్శనలు వేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న ఎంపీటీసీ సభ్యుడు అభిమన్యూరెడ్డి

రాజాపూర్: మండలంలోని రాఘవాపూర్‌లో శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం హోమకార్యక్రమాలు నిర్వహించిన అనంతరం దోండ్లపల్లి ఎంపీటీసీ సభ్యుడు అభిమన్యూరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన నాయనమ్మ రేణుకాదేవి జ్ఞాపకార్థం ఆలయాలను నిర్మించడం తన పూర్వజన్మ సుకృతమని అభిమన్యూరెడ్డి పేర్కొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రామకృష్ణగౌడ్, శ్రీనివాస్, ప్రియాంక, చిరంజీవి, సేవ్యానాయక్, హుున్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా విత్తనాల సాగు

శాంతినగర్: సోమవారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షంతో పొలాల్లో నీరు నిలిచి పూర్తిస్థాయిలో పొలాలు తడవడంతో అన్నదాతలు విత్తనాలు విత్తే పనిలో నిమగ్నమయ్యారు. మంగళవారం ఆయా గ్రామాల్లోని పొలాల్లో రైతులు పత్తి, ఆముదాలు, వేరుశనగ విత్తనాలు విత్తే పనిలో బిజీ అయ్యారు. కూలీలు, ఎద్దుల గెడాలతో పొలాల్లో సందడి నెలకొంది.

నీట్‌లో 'రిషి' విద్యార్థుల సత్తా



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న రిషి యాజమాన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం విడుదల చేసిన నీట్ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని రిషి అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ఈ మేరకు అకాడమీకి చెందిన అనన్య 627 మార్కులు, మౌనిక 621, సఫాన్ సాద్ 610, సంతోష్ 600 మార్కులు సాధించినట్లు అకాడమీ కరస్పాండెంట్ చంద్రకళావెంకట్ పేర్కొన్నారు. 600లకు పైగా ఐదుగురు, 550 మార్కులు 20 మంది, 500లకు పైగా 50 మంది మార్కులు సాధించినట్లు తెలియజేశారు. తమ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించడం గర్వంగా ఉందని, ఎక్కువ సంఖ్యలో మెడికల్ సీట్లు సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో సలహాదారు వెంకటయ్య, డీన్ భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

'వాగ్దేవి' విజయకేతనం



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజామన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని వాగ్దేవీ కళాశాల విద్యార్థులు ప్రభుత్వం విడుదల చేసిన నీట్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చారు. ఈ మేరకు నీట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి మాట్లాడారు. మా విద్యార్థులకు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో పోటీ పడేలా తీర్చిదిద్దామని, ఇన్నొవేటివ్ సైంటిఫిక్ టీచింగ్ అప్రోచ్ కార్యక్రమం ద్వారా ప్రత్యేక బోధన చేశామన్నారు. కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించి తల్లిదండ్రులు, జిల్లా పేరును నిలబెట్టారన్నారు. ఈ మేరకు కళాశాలకు చెందిన 30 నుంచి 45 మంది విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గీతాదేవి, ఐఐటీ, నీట్ అకాడమీ ఇన్‌చార్జ్ పావని, యాకుబ్, షాకీర్, శివకుమార్, రాఘవేందర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు



కౌంటింగ్ హాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, అబ్జర్వర్లు

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని నెల్లికొండి వ్యవసాయ మార్కెట్‌యార్డు గోదాంలో మంగళవారం నిర్వహించిన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతవరణంలో ముగిసింది. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అసౌర్యాలు, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 నుంచి ప్రారంభమైన కౌంటింగ్.. సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. పార్లమెంట్ పరిధిలో మొత్తం ఏడు నియోజకవర్గాలు ఉండగా.. నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, వనపర్తి, కల్వకుర్తి, అలంపూర్, గద్వాల అసెంబ్లీ సెగ్మెంట్లకు సబంధించిన ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా కొనసాగింది. కౌంటింగ్ అబ్జర్వర్లు సత్పాల్ శర్మ, రుచేష్ జైవాన్షీ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్, అభ్యర్థుల సమక్షంలో ఉదయం 8 గంటలకు స్ట్రాంగ్‌రూం తెరిచి, ఈవీఎంలను టేబుళ్లపైకి పంపించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి సంబంధించి ముందుగా పోస్టల్ బ్యాలెట్లు లెక్కించి.. తర్వాత ఈవీఎంల ఓట్లను లెక్కించారు. ఎంపీగా విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లురవి.. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో కలెక్టర్ ఉదయ్ కుమార్ చేతులమీదుగా ధ్రువపత్రం అందుకున్నారు.

నిరంతర పర్యవేక్షణ..

కౌంటింగ్ ప్రక్రియను కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్, ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. రౌండ్ల వారీగా ఫలితాలను పరిశీలించడంతో పాటు ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. రిటర్నింగ్ అధికారుల అనుమతితో ఎన్నికల ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు మల్లురవి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, పోతుగంటి భరత్‌ప్రసాద్ కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించారు.

పటిష్ట భద్రత..

కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. మీడియా, అనుమతి ఉన్న వారిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే కేంద్రంలోకి అనుమతించారు. ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించలేదు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారీ బందోబస్తు నిర్వహించారు. కౌంటింగ్‌లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది, విలేకరులకు భోజన వసతి కల్పించారు. భోజన సమయంలో కౌంటింగ్‌కు ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా ఇన్‌చార్జి అధికారులు చర్యలు చేపట్టారు.



ఈవీఎంల ఓట్లను లెక్కిస్తున్న సిబ్బంది



ఈవీఎం మిషన్లు తీసుకెళ్తున్న సిబ్బంది



బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు